# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 10, సెప్టెంబర్ 2025


## తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని "కాళోజీ"

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త



తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వనిగా కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజలందరికీ చిరస్మరణీయులని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలకు హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమం ప్రతిధ్వనిగా కాళోజి నారాయణరావు తెలంగాణ ప్రజలందరికీ సుపరిచితులని అన్నారు. తెలంగాణ వైతాళికుడిగా జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని, తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమమే ఊపిరిగా జీవించాలని తెలిపారు. తెలంగాణ మిగతా 2లో..

## రాజీమార్గమే రాజమార్గం..

★ ఈనెల 13న జాతీయ లోక్‌అదాలత్

★ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 13వ తేదీన జరుగుతున్న "జాతీయ లోక్ అదాలత్"ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయి ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే అవి సమసిపోతాయని రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లాలో వివిధ రకాల రాజీపడదగు కేసులలోని కక్షిదారులకు విజ్ఞప్తి చేస్తూ ఒక ప్రకటనను విడుదల చేసారు. ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13 వ తేదీన ఆసిఫాబాద్, సిర్పూర్ (టీ) కోర్టులలో "జాతీయ లోక్ అదాలత్" సందర్భంగా కక్షిదారులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. మీపై కేసులు ఉంటే వాటిని రాజీ చేసుకొని కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసులను పూర్తిగా క్లోజ్ చేయడం జరుగుతుందని అన్నారు. యాక్సిడెంట్ కేసులు, వ్యక్తుల పై దాడి చేసే కేసులు, చీటింగ్ కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగతనం కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు మరియు ఇతర రాజీ పడదగు కేసులలో ఈ నేషనల్ లోక్ అదాలత్ లో రాజీ చేసుకుని క్లోజ్ చేసుకోవచ్చని ఎస్పీ అన్నారు. ఈ అవకాశాన్ని కేసులలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోగలరని కోరారు. దీనికోసం ఫిర్యాదు దారుడు మరియు నేరస్తులు అందరూ తమ యొక్క ఆధార్ కార్డు తీసుకుని సంబంధిత కోర్ట్ / ప్రదేశంలో హాజరుకావాలని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌ను, వినియోగించుకోవాలనుకునేవారు సంబంధిత పోలీస్ స్టేషన్లలో లేదా కోర్ట్ కానిస్టేబుల్స్‌ని సంప్రదించాలని అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా బాధితులకు మంచి అవకాశం అని, ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

## రెండు రోజుల వ్యవధిలో..

# ఇద్దరు ఒప్పంద ఉపాధ్యాయుల మృతి

- ఐటిడిఏ గిరిజన పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సిఆర్‌టి లు
- గత ఐదు నెలల నుంచి సిఆర్‌టి లకు వేతనాలు లేవు
- వేతన జాప్యం వల్లే ఆస్పత్రికి వెళ్ళక మృతి చెందినట్లు సిఆర్‌టి నాయకుల ఆరోపణ
- మృతి చెందిన సిఆర్టి ల కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి





ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఐటిడిఏ పరిధిలోని గిరిజన పాఠశాలలు విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఒప్పంద గిరిజన ఉపాధ్యాయులు అనారోగ్యంతో రెండు రోజుల వ్యవధిలో తనువు చాలించారు. మృతిచెందిన సిఆర్‌టి లు తిర్యాణి మండలం మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన మాడవి లింగారావు సిఆర్టిగా రొంపల్లి స్కూల్ కాంప్లెక్స్ టిడబ్ల్యూపీఎస్ కొలం గుడాలో విధులు నిర్వహిస్తున్నారు. బెజ్జూరు మండలం సల్గుపల్లి గ్రామానికి చెంది తొర్రెం శంకర్ ప్రసాద్‌సి ఆర్‌టిటిడబ్ల్యు పిఎస్ బుర్గుడా సోమినీ కాంప్లెక్స్ విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గత ఐదు నెలల నుంచి జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులతో ఆసుపత్రికి వెళ్లలేక అనారోగ్యంతో తనువు చాలించినట్లు సిఆర్‌టి నాయకులు సిఆర్‌టి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సిఆర్‌టిలు వాపోతున్నారు. వీరి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని తక్షణమే సిఆర్టిలకు వేతనాలు మంజూరు చేసి మృతి చెందిన సిఆర్టిల మిగతా 2లో..

### సీఆర్టీ కుటుంబానికి ఆర్థిక సహాయం..

ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల బూరుగుడలో సీఆర్‌టి గా విధులు నిర్వహించిన తొర్రెం శంకర్ ప్రసాద్ అనారోగ్యం కారణంతో మరణించడంతో డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి ఆదేశాల మేరకు సోమిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పంద్రం బిక్షమయ్య, ఎస్‌సి ఆర్ పి నందారాం, సిఆర్‌టిలు మృతుని అంత్యక్రియలలో పాల్గొని వారి కుటుంబాన్ని ఓదార్చడం జరిగింది. తమ కుటుంబానికి ఐటీడీఏ సంస్థ అధికారుల సహాయ సహకారం ఉంటుందని, ఈ సందర్భంగా సిఆర్టి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 10,000 రూపాయలను అందించారు.



## విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

✳ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి ✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలం కాజీపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్య రంగా అభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన మిగతా 2లో..



## యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

మంచిర్యాల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త

కర్షకులకు కష్టాలు తప్పడం లేదు. మొన్నటి వరకు భారీ వర్షాలతో అతలాకుతలమైన అన్నదాతలకు యూరియా కొరతతో రోడ్డు ఎక్కుతున్నారు. హాజీపూర్ మండలంలో యూరియా కొరత ఏర్పడడంతో మంగళవారం రైతులు హాజీపూర్ మండల కేంద్రం లోని 63వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పడ్తనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యూరియా కోసం 15 రోజులుగా ఎదురు చూస్తుంటే సరిపడా యూరియా పంపిణీ చేయడం లేదని జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. యూరియా కావాలని రోడ్డు పై కూర్చొని మిగతా 2లో..



## తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని "కాళోజీ"

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం కాళోజీ జయంతి రోజున తెలంగాణ భాషా దినోత్సవంగా కాళోజి సేవలను భావితరాలకు తెలిసేలా వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష అని, విద్యార్థి దశలోనే నిజాం ఎదిరించి తెలంగాణలో విద్యా వ్యాప్తికి కృషి చేశారని తెలిపారు. తన రచనలతో ప్రజలను చైతన్య పరుస్తూ ఆదర్శంగా నిలిచారని అన్నారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు ఒప్పంద ఉపాధ్యాయుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని సిఆర్టి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం రోజున సలుగుపల్లి గ్రామానికి చెందిన మృతుడు సి ఆర్ టి కుటుంబానికి వెళ్లి పరామర్శించినట్లు వారు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సిఆర్‌టి లకు తక్షణమే వేతనాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. మృతుని కుటుంబానికి పరా మర్శించిన వారిలో సిఆర్‌టి జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి జరుపుల విజేష్ కమ్మర్గాం గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ సి ఆర్ టి లు రమేష్, చేతన్, మహేష్, సురేష్, హనుమంత్, అశోక్, సంతోష్, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

(మొదటిపేజీ తరువాయి)

నిరసన తెలిపారు. రహదారిపై రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. యూరియా ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక ఎస్ఐ స్వరూప్ రాజ్ ధర్నా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి ప్రయత్నం చేశారు. మండల వ్యవసాయ అధికారి రావాలి, కలెక్టర్ రావాలి అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న వ్యవసాయ అధికారి కృష్ణ సంబంధిత ఉన్నత అధికారులతో మాట్లాడి పంపిణీ చేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. తాము ఖరీఫ్ సాగులో కష్టపడి వరి పంట సాగు చేసుకుంటున్నామని, పంటకు అవసరమయ్యే యూరియా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే రైతులకు కష్టాలు వస్తాయని వారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కూడా యూరియా కొరత ఏర్పడిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అవసరమయ్యే యూరియాను అందుబాటులో ఉంచి అన్నదాత కష్టాలను తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు.

## మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

వేమనపల్లి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త

వేమనపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అడిచెర్ల స్రవంతి, గుంట అశోక్, అదేవిధంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు మండల విద్యాధికారి బొబ్బాల శ్రీధర్ రెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులు తోకల నారాయణ,నీలం దివ్య, వగావత్ వినోద్ కుమార్, మొగుల మధుకర్ పి.రాజశేఖర్, సముద్రాల రమాదేవి, వారణాసి కమల, లక్ష్మి, అపర్ణ, సింధుజ, సంధ్యారాణి, రవీందర్, సీఆర్పీలు అశోక్, వెంకటేష్‌లు ఉన్నారు. ఈ సమావేశంలో నీల్వాయి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గిరిధర్ రెడ్డి,మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, డి.సి.పి. ఎ. భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వెనుకబడిన అభివృద్ధి అధికారి పురుషోత్తంలతో కలిసి పోలీస్, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు, ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసులు, పరిష్కారం, బాధితులకు న్యాయం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నెలకొన్న ఎస్.సి., ఎస్.టి. సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు శాఖ పరిధిలోని అట్రాసిటీ కేసులు కార్యచరణ ప్రకారంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులలో మహిళా బాధితులకు సంబంధించి అందించవలసిన పరిహారం, ఇతర బాధితులకు అందించవలసిన పరిహారం వివరాలు అందించినట్లయితే రాష్ట్ర కమిటీకి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అట్రాసిటీ బాధితులలో పిల్లలు ఉన్నట్లయితే షెడ్యూల్డ్ కులములకు చెందిన వారికి గురుకులాలలో, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారికి ఆశ్రమ పాఠశాలలలో విద్య అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అట్రాసిటీ కేసులలో బాధితులు కుల ధృవీకరణ పత్రాల జారీలో ప్రక్రియ వేగవంతం చేసే విధంగా రాజస్వ మండల అధికారులు చర్యలు తీసుకొని వారి పరిధిలోని తహశిల్దార్లకు తగు సూచనలు చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులలో తప్పుడు కేసులు నమోదు చేసిన వాటి వివరాలను స్పష్టంగా రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ కేసులలో ఫిర్యాదుదారులు చేసిన ఫిర్యాదులో వివరాలు సక్రమంగా ఉన్నట్లయితే సమగ్ర విచారణ జరిపి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి.ల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపులో అట్రాసిటీ కేసులలో హత్య, అత్యాచారం సంబంధిత వాటిలో బాధితులకు ప్రాధాన్యత ఇస్తూ వారి స్థానికత ఆధారంగా కేటాయించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# తెలంగాణ తొలి పొద్దు కాళోజీ..

**సింగరేణి మందమరి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ**

బెల్లంపల్లి, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

సింగరేణి మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రజా కవి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి జయంతి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాకవి కాళోజీ నారాయణరావు (జననం సెప్టెంబరు 9, 1914 మరణం నవంబరు 13, 2002) "కాళోజీ నారాయణరావు లేదా కాళోజీ లేదా కాళన్న"గా సుపరిచితులు. అతను తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడబడతాడు. అతను రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. కవిత్వం వ్రాసిన ప్రజాకవి. హక్కులడిగిన ప్రజల మనిషి. ఉద్యమం నడిపిన ప్రజావాది. మొత్తంగా తెలంగాణ జీవిత చలనశీలి కాళోజి. పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణకిచ్చిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా అతను తన కలం ఎత్తాడు. అతను స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణా ఉద్యమకారుడు. అతను 1992లో భారతదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ పొందాడు అని అన్నారు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయితగా ప్రఖ్యాతిగాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. నా గొడవ పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం అతను గేయాల్లో రూపుకడతాయి. బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడిందని అన్నారు. తెలంగాణ తొలిపొద్దు కాళోజీ. అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడ్ని అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని అన్నారు. అదేవిధంగా మందమర్రి ఏరియా లో ఎల్లప్పుడూ రక్షణతో కూడిన ఉత్పత్తి దిశగా సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం విజయ ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సీఎంఓఏఐ అధ్యక్షులు రవి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, జి.ఎం కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.




# విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

త్రాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం నిర్దేశిత విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, బిల్లుల చెల్లింపులు సులభతరం అవుతాయని తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్వాడి పరిధిలో గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమం కొరకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని సకాలంలో లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లోపం ఉన్న పిల్లలను గుర్తించి సాధారణ స్థితికి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు కొరకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, వంటశాల, వంట సామాగ్రి భద్రపరచు గది, పరిసరాలను పరిశీలించారు. 6వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్య అందించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించి, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్మిస్తున్న ఇంటర్మీడియట్ అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజల సౌకర్యార్థం వైద్య సేవలను వేగంగా, మరింత మెరుగ్గా అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సతీష్ రెడ్డి, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## కాళోజీ జీవితం..

# ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**- ఘనంగా ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు**

నస్పూర్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలు ఆచరణీయం అని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో కాళోజీ నారాయణ రావు జయంతి వేడు కలు ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణ రావు తెలంగాణ ఉద్యమ పితామహుడిగా ప్రసిద్ధి చెందారని, తెలంగాణ ప్రజల ప్రతిధ్వనిగా నిలిచారని, ప్రజల గోడును రాతలుగా మార్చిన గొప్ప కవి, ఉద్యమకారుడని, ఆయన రచనలు ప్రజల భావోద్వేగాలకు అద్దం పట్టాయని, ఖనా గొడవఖ, ఖజీవన గీతఖ వంటి రచనలు సామాన్యుల గొంతుగా నిలిచాయని, కాళోజీ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి గౌరవించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, జీఎం కార్యాలయ పిట్ కార్యదర్శి సందీప్, అధికారుల సంఘం నాయకులు వి దేవేందర్ రెడ్డి, డీజీఎంలు ఎస్. అనిల్ కుమార్, ఆనంద్ కుమార్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి ్మ, లా అధికారి ప్రబంధిత, డీవైపీఎం రాజేష్, అకౌంట్స్ అధికారి నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రక్షణతో ఉత్పత్తి సాధన...

బెల్లంపల్లి, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

సింగరేణి ఉద్యోగులు రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ బొగ్గు ఉత్పత్తిలో బాగస్వాములు కావాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున ఖైరిగుర ఉపరితల గని వద్ద రక్షణ, ప్రథమ చికిత్స పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ఇటీవలే బెల్లంపల్లి ఏరియాకు ప్రథమ చికిత్సలో సింగరేణి వ్యాప్తంగా మొదటి బహుమతి, రక్షణలో గ్రూప్ త్రీలో ప్రథమ బహుమతి రావడం ప్రశంసనీయం అన్నారు. బహుమతులను సమావేశంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగులు ఇంటినుంచే రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పని ప్రదేశాల్లో రక్షణ పరికరాలను ధరించకుండా పనులు చేయవద్దని సూచించారు. అలాగే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స పై ప్రతి ఉద్యోగి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. రక్షణ, ప్రథమ చికిత్సలో ఖైరిగుర ఉపరితల గనికి బహుమతులు రావడం పట్ల అధికారులు, ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, పిఓ మచ్చగిరి నరేందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ జె శంకర్, సేఫ్టీ అధికారి గౌతమ్ రాజేష్ రెడ్డి, సంక్షేమ అధికారి రజినికుమార్, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను ప్రదర్శిస్తున్న జీఎం

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కాళోజి

**- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా కాళోజి జయంతి వేడుకలు**






ఆసిఫాబాద్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త

మంగళవారం రోజు ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా, ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కాళోజి కేవలం కవి మాత్రమే కాకుండా స్వాతంత్ర సమరయోధుడు, సమాజసేవకుడు, సంఘ సంస్కర్త, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, మానవతావాది అని తెలిపారు. ఆయన రచనలు తెలంగాణ సాంస్కృతిక విలువలు, ప్రజల కష్టసుఖాలు, సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించాయని చెప్పారు. అందుకే ఆయనకు "ప్రజాకవి" అనే గౌరవం దక్కిందని పేర్కొన్నారు. కాళోజి సాహిత్యం, రచనలు 1992లో దేశవ్యాప్తంగా గుర్తింపు పొంది పద్మ విభూషణ్‌తో పురస్కరించబడ్డారు. జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకోవటం వారికి ఇచ్చిన గొప్ప బహుమతి అని కొనియాడారు. ఆయన చూపిన మానవ విలువలు, సమానత్వం, నిజాయితీ, సమాజ సేవ మార్గం యువతకు ఎల్లప్పుడూ ఆదర్శమని, కాళోజి జీవితం మనందరికీ ప్రేరణ అని ఎస్పీ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ (ఎం.టి.ఓ) అంజన్న, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డొంగర్‌గావ్‌లో వైద్య శిబిరం

**- మూడు కిలోమీటర్లు కాలిబాటన వెళ్లిన జిల్లా వైద్యాధికారి**

వాంకిడి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని సవతి గ్రామపంచాయతీ పరిధిలో గల దొంగార్‌గావ్ గ్రామంలో మంగళవారం జిల్లా వైద్య అధికారి డాక్టర్ సీతారాం, ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మారుమూల గ్రామమైన దొంగరుగావుకు మూడు కిలోమీటర్లు కాలిబాటను నడుచుకుంటూ వెళ్లి వేద శిబిరాన్ని నిర్వహించి గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పిస్తూ, గర్భిణీలు ప్రసవానికి వారం రోజుల ముందే ఆసుపత్రికి రావాలని, సరైన సమయంలో టీకాలు వేసుకోవాలని, అదేవిధంగా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో వాంకిడి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పాత బెల్లంపల్లిలో పిడుగుపడి మహిళ మృతి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామంలో పిడుగుపాటుకు గురై మహిళా వ్యవసాయ కూలి అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆదిముల్ల గెల్లు పద్మ, ఆదిముల్ల మహేందర్ ప్రత్తి చేనులో కలుపు పనులు చేసేందుకు ఆదిముల్ల పావని, గాంద్రపు అంజలి, నస్పూర్ల భాగ్య, మరో ఇద్దరు మహిళా వ్యవసాయ కూలీలతో కలిసి ప్రత్తి పంటలో కలుపు తీస్తున్నారు. ఇంతలోనే ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇదే క్రమంలో భారీ శబ్దం పిడుగు వేసింది. ఈ సంఘటనలో గెల్లుపద్మ అనే వ్యవసాయ మహిళా కూలి అక్కడిక్కడే మృతి చెందింది. గ్రామానికి చెందిన ఆదిముల్ల మహేందర్ ప్రత్తి చేనులో గెల్లుపద్మ మరికొంత మహిళల తో కలిసి కలుపు తీసే పనిలో నిమగ్నమయ్యారు ఇంతలోనే ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా ఒక్క సారిగా పిడుగు వేసింది. ఈ సంఘటనలో గ్రామానికి చెందిన గెల్లపద్మ (45) అనే వ్యవసాయ కూలి అక్కడి కక్కడే మృతి చెందారు.పిడుగు దాటికి మిగతా వ్యవసాయ మహిళా కూలీలు పరుగులు తీశారు .ఈ ఘటన లో గ్రామానికి ఆదిముల్ల పావని స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. మిగతా మహిళా కూలీలు సురక్షితంగా బయట పడ్డారు.ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. తాళ్ళగురిజాల ఎస్సై రామకృష్ణ సంఘటన స్థలాన్ని సందర్శించి మృత దేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గెల్లుపద్మకు భర్త వెంకటి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే బెల్లంపల్లి మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కారుకూరి రామచందర్ ఆసుపత్రికి చేరుకొని మృతురాలి కుటుంబాన్ని ఓదార్చారు. ప్రభుత్వపరంగా ఆపద్బాందు పథకం ద్వారా ఈ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

# ఈ నెల 11న మినీ జాబ్ మేళా

## మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

నస్పూర్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

జిల్లాలోని నిరుద్యోగ యువతకు జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11వ తేదీన ఉదయం 10:30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హెటెరో కంపెనీ హైదరాబాద్ సంస్థలో హైదరాబాద్ ప్రాంతంలో 40 జూనియర్ ఆఫీసర్ (స్త్రీలు/పురుషులు), 100 జూనియర్ కెమిస్ట్/ ట్రైనీ ప్రొడక్షన్ (పురుషులు), 60 జూనియర్ ఇంజనీర్ / ట్రైనీ ఇంజనీరింగ్/మెయింటెనెన్స్ (పురుషులు) పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. 18 25 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండి సరైన విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశం కల్పించడం జరుగుతుందని, ఇతర వివరాలకు 9059888389, 7702284181, 9110368501 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్, విద్యారత సర్టిఫికెట్లు నిజప్రతులతో పాటు ఒక జత నకలు ప్రతులతో మినీ జాబ్ మేళాకు సకాలంలో హాజరు కావాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడింది. కొత్తపల్లి వెంకట లక్ష్మీ చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మొత్తం 30 మంది హాజరుకాగా వారిలో 16 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, కంటి పరీక్షలకు వచ్చిన వృద్ధులు అధైర్యపడవద్దని, లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కంటి శుక్లాలు ఉన్నవారు కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి తదితరులు పాల్గొన్నారు.



## రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులందరూ సురక్షితంగా ఉన్నారు

**- మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత**

నస్పూర్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం చందనాపూర్‌లో గల తెలంగాణ రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులందరూ సురక్షితంగా ఉన్నారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోమల నివారణలో భాగంగా పాఠశాల తరగతి గదులలో పిచికారి చేసిన దోమల మందు కారణంగా పాఠశాలలో 6, 7, 8 తరగతులు చదువుతున్న కొంతమంది విద్యార్థులకు అలెర్జీ వచ్చిందని, వారిని సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించి మంగళవారం రోజున ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేయడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పిల్లల వైద్య నిపుణులతో మాట్లాడి పిల్లలకు వైద్య సేవలు అందించడం జరిగిందని, వారిలో ఒక విద్యార్థికి కళ్ళలో మంటలు ఉన్నందున చికిత్స అందించడం జరిగిందని, ప్రస్తుతం పిల్లలందరి ఆరోగ్యం సురక్షితంగా ఉందని తెలిపారు.



## డిగ్రీలో చేరిన విద్యార్థులకు అవగాహన సదస్సు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ కళాశాలలో నూతనంగా చేరిన డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సును (ఓరియంటేషన్) నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ, డిగ్రీలో సెమిస్టర్ విధానం అమలవుతున్నందున విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. సెమిస్టర్ విధానంలో ఉండే క్రెడిట్ నిబంధనలు విద్యార్థులకు వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. లక్ష్మీనరసింహం మాట్లాడుతూ, విద్యార్థులు డిగ్రీ నుండి అకాడమిక్ పాఠ్యపుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ పుస్తకాలు చదవాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల భర్తీ, ఎంపిక విధానం మొదలగు అంశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్ధన్ అకాడమిక్ అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి తూడూరు దత్తాత్రేయ, పరీక్షల విభాగం ఇంచార్జ్ బి వెంకటేశం ఐ.క్యూ.ఎ.సి ఇన్చార్జ్ ఇ.శారద, డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులకు నిధుల కోత విధించిన కేంద్ర ప్రభుత్వం

జన్నారం, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త

కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధుల కోత విధించడం వలన వంద రోజుల పని చేసిన కూలీలకు గత నాలుగు నెలలుగా కూలీ డబ్బులు రావడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి సంఖ్య రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతలు విధించడం వలన వందరోజుల పని చేసిన కూలీలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. అమెరికా ట్రంప్ కు భయపడి మోడీ ప్రభుత్వం అమెరిక నుంచి పత్తి, పాలు, చికెన్, సోయాబీన్ పంటల పైన జీరో సుంకాలు వేయడంతో రాబోయే రోజుల్లో పత్తి, పాలు, చికెన్, సోయాబీన్ భారతదేశం మార్కెట్లోకి రాబోతున్నాయి. దీనివలన భారతదేశ రైతాంగం పండిస్తున్న పంటలను కొనేవాళ్ల లేకుండా పోతారు. రైతాంగం తమ పంటలు అమ్ముడుపోక పెట్టుబడులుకుడా రాకపోవడం మూలంగా దివాలా తీసి ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉన్నాదని అన్నారు. ఇదేనా బిజేపీ మోడీ స్వదేశీ విధానం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. రైతాంగం ప్రజలు వ్యవసాయ రంగాన్ని భారతదేశాన్ని కాపాడుకోవడం కోసం బిజెపి మోడీ ప్రభుత్వ విధానాలపై పెట్టిన పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కనికరపు అశోక్, నాయకులు కె.లింగన్న, కె.బుచ్చన్న, దాసండ్లా రాజన్న, అంబటి లక్ష్మణ్, శాఖల సభ్యులు పాల్గొన్నారు.



# మహనీయులు చూపిన మార్గం ఆచరణీయం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త




ప్రజాశ్రేయస్సు కోసం చేసిన త్యాగాల వల్ల వ్యక్తులు మహనీయులుగా కీర్తించబడతారని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజాకవి కాళోజి నారాయణ రావు జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాళోజి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహనీయులను స్ఫూర్తి గా తీసుకొని మన నిత్య విధుల్లో నిజాయితీగా ఉండాలని తెలిపారు. కాళోజి రచనలు, కవితలు సరళంగా ఉండి ప్రజల్లో చైతన్యాన్ని నింపాయని అన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించిన ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనకు పద్మ విభూషణ్ ప్రధానం చేయడం జరిగిందన్నారు. ఆయన పుట్టిన రోజును తెలంగాణ బాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వించదగిన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకుడు బయ్య మొగిలి, సిఎంఓఏఐ ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, డీజీఎం (ఐఈడి) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి ఎం. శ్రీనివాస్ అన్ని విభాగాల అధిపతులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి శిక్షణ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు రాత పరీక్షలు

మందమర్రి, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

సింగరేణి సేవ సమితి ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో వృత్తి శిక్షణ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు ఏరియా ఎస్ఓటు జిఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్ అధ్యక్షతన మందమర్రిలోని సిఈఆర్ క్లబ్బులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 344 మంది టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ కోర్సులకు రాత పరీక్షలు నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ, శిక్షణ తర్వాత స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించాలని సూచించారు. సింగరేణి యాజమాన్యం సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని ఇంకా అనేక కార్యక్రమాలను కూడా నూతనంగా చేపడుతుందని అన్నారు. మహిళలు, యువతులు, ఇట్టి అవకాశాలను వినియోగించుకొని స్వయం ఉపాధి సంపాదించుకొని మీ కుటుంబాలకు మార్గదర్శకంగా నిలబడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, సీనియర్ పి.ఓ శంకర్, జె.అనసూయ రీజినల్ ఆఫీసర్ ఖాది, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ హైదరాబాద్ శివకుమార్, మందమర్రి సేవా సమితి ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.



# శ్రీరాంపూర్ ఏరియాను అగ్ర స్థానంలో నిలపాలి

**ప్రతి ఉద్యోగి నిబద్ధతతో విధులు నిర్వహించాలి - శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్**

నస్పూర్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి శ్రీరాంపూర్ ఏరియాను సింగరేణిలో అగ్రస్థానంలో నిలపాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆర్.కె 5 గని ఈ అండ్ ఎం సూపర్వైజర్లు, మైనింగ్ స్టాఫ్‌తో ఉత్పత్తి, ఉత్పాదకత పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే సంస్థ మనుగడ సాధ్యమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్.కె-5 గనికి నిర్ధేశించిన 2.7 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాలని, ఆ దిశగా గని అధికారులు, ఈ అండ్ ఎం సూపర్వైజర్లు, మైనింగ్ స్టాఫ్, ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగుల గైర్హాజరు ఉత్పత్తి సాధన పై ప్రభావం చూపుతుందని, యువ ఉద్యోగులు గైర్హాజరు లేకుండా విధులకు హాజరయ్యేలా అవగాహన కల్పించి, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేలా కృషి చేయాలని గని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.కె 5, 6 గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, గని మేనేజర్ శ్రీ సుధీర్ కుమార్ ఝా, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

